# సింగిల్ పేజీ కథలు


వెంకట్రావ్ ఆఫీసులోకి వచ్చేటప్పుడు బయటకు వెళ్ళేటప్పుడు సెక్యూరిటీగార్డు వినయంగా 'సెల్యూట్' కొడతాడు.

## సెల్యూట్

ఆ ఆఫీసులో అతను చేరి రెండేళ్ళు యినా కాలేదు అయినా అతని చుట్టూ ఎంతోమంది తిరుగుతూ ఉంటారు. పై వర్గాలలో కొంతమందికి 'ఇది' కన్నెర్రగా ఉంటే అతని బాస్ పరమేశ్వర్రావుకు మాత్రం తలకొట్టేసినట్లుగా ఉంది. ఈ రా, వెంకట్రావ్ కల్సి బయటకు వస్తున్న సందర్భాలలో 'గార్డ్' ఎప్పుడూ ఆ కు సెల్యూట్ చేసినట్లు గుర్తులేదు.

ఇది ఇలావుండగా ఇతర డిపార్ట్మెంట్స్ వాళ్ళల్లో చాలామంది వెంకట్రావు దగ్గరకు రావడం 'నమస్తే' అంటూ కరచాలనం చెయ్యడం, ఏదో గొణుగుతూ వెళ్ళా డటం ఆ తర్వాత వాళ్ళల్లో ఆనందం విరియడం చాలారోజులుగా జరుగుతూ వస్తోంది.

ఇలాగే ఉంటే పరిస్థితి ముదిరేటట్లుగా ఉందని వెంకట్రావును ఒకరోజు కాఫీ హోటల్కు తీసుకెళ్ళి తన సందేహాన్ని బయటపెట్టాడు పరమేశ్వర్రావు.



''వాళ్ళలా ప్రవర్తించటంలో పెద్ద విశేషమంటూ ఏమీలేదు సార్! మన ఆఫీసుని కాపలా కాసే సెక్యూరిటీగార్డుకు ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నాయి. ప్రతి నెలా అప్పులు చెయ్యందే వాడి జీవితం గడవదు. నేనొచ్చిన కొత్తల్లో అడపాదడపా నన్ను అప్పు అడుగుతూండేవాడు. కాని అదెలా తీర్చాలో అతనికి తెలియదు. దానికేదో ప్రత్యుపకారం చేస్తున్నట్లు కన్పడిన చోటల్లా ఒకటికి రెండుసార్లు ఇలా సెల్యూట్ కొడ్తూంటాడు. ఇలా ఎప్పుడయినా అప్పు ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే సెల్యూట్ మాట అటుంచి చూసీ చూడనట్లుగా ప్రవర్తిస్తాడు. ఇలా సెల్యూట్లకు అలవాటు పడినవాళ్ళు వాడికి అప్పులిచ్చి 'రెన్యువల్' చేయించుకుంటూ ఉండాలి. అతనికి మన హోదాలతో సంబంధం లేదు. అప్పు ఇవ్వగలిగే వాళ్ళు కావాలి. ఇక నా చుట్టూ మూగే చాలామంది ఆ బాపతే. అప్పుడప్పుడు వాళ్ళ డబ్బు అవసరాలు తీర్చాలి. ఇందులో ప్రత్యేకంగా రహస్యం అంటూ ఏమీ లేదు. ఇలాంటి వాళ్ళు ప్రతిచోటా కన్పడతారు'' అంటూ బాస్ ఇన్నాళ్ళుగా పడుతున్న అపోహలకు తెరదించాడు శ్రీమాన్ వెంకట్రావ్.

**–జీడిగుంట నరసింహమూర్తి**
(సిర్పూర్ కాగజ్నగర్)

## అపార్థం

అక్కడ ఫంక్షన్ హడావిడిగా ఉంది. అవురావుమనిపించేలా ఉంది. సుమ, సుధీర్, సుమంత్ అటు యిటు తిరుగుతూ, వచ్చిన వారిని నవ్వుతూ పలకరిస్తున్నారు.

సుబ్బారావుగారి భార్య సుమతి కూడా చక్కగా అలంకరించుకుని, అందర్నీ నవ్వుతూ ఆహ్వానిస్తోంది. అది షష్టిపూర్తి ఫంక్షన్. కాని అక్కడ సుబ్బారావుగారు మాత్రం లేరు.



అనంత్ బలవంతం మీద వచ్చిన శ్రీను మాత్రం తనకు అక్కడ ఎవరూ తెలియక బిక్కు బిక్కుమంటూ అటూ యిటూ చూస్తున్నాడు. అనంత్ శ్రీనును వదిలేసి తన ఫ్రెండ్స్తో హాయిగా నవ్వుతున్నాడు. మధ్య మధ్యలో శ్రీనుని తమదగ్గరకు రమ్మంటున్నాడు గాని శ్రీను వాళ్ళతో కలలేకపోతున్నాడు. ఆఖరికి బలవంతంగా అనంత్ దగ్గరకు వెళ్ళి ''అనంత్! ఇంతకీ ఫంక్షనుకి ముఖ్యమైన వ్యక్తి అయిన సుబ్బారావుగారు ఏరి'' అని అడిగాడు శ్రీను.

ఓ, అదా! ఆయనకు మేజర్ ఆపరేషన్ ఉందట అని ముక్తసరిగా చెప్పేసి మరలా అటుతిరిగి పోయాడు.

భర్తకు అక్కడ ఆపరేషన్ అవుతుంటే సుమతిగారేంటి, ఇక్కడ పిల్లలతో అలా ఎంజాయ్ చేస్తుంది. ఆవిడసలు భార్యేనా, భర్త చనిపోయాడా, పోనీ విడాకులు తీసుకుందా అని అనుకుందామంటే అది షష్టిపూర్తి ఫంక్షన్. వారం ముందే కార్డులు పంచారు. ఊరంతా ఇదెక్కడి మనుష్యులురా బాబు అనుకున్నాడు శ్రీను.

ఫంక్షను చాలా వరకూ అయిపోయింది. రాత్రి తొమ్మిదిన్నర సమయంలో వచ్చిన సుబ్బారావుగారిని చూసి నోరు ఆవలించాడు శ్రీను. ఇంతకీ సుబ్బారావు గారు డాక్టరని, ఆయన అర్జంటు మేజర్ ఆపరేషన్ చేయవలసి వచ్చిందని శ్రీనుకి తెలియదు.

**–జి. కోటేశ్వరప్రసాద్**
(కాకినాడ)